క్లుప్తంగా

టమాటా వాహనం బోల్తా



ములకలచెరువు: మండలంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపం వద్ద సోమవారం సాయంత్రం అదుపుతప్పి టమాటా వాహనం బోల్తా పడింది. టమాటాలు రోడ్డు పాలయ్యాయి. పీటీయం నుంచి ములకలచెరువు టమాటా మార్కెట్‌కు టమాటాల లోడుతో వస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పింది. ప్రమాదంలో డ్రైవర్ శివకుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. 60 క్రేట్ల టమాటాలు నేలపాలయ్యాయి.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ నాగవేణి ఒక ప్రకటనలో కోరారు. తంబళ్లపల్లె మండలంలో మంద్యంవారిపల్లె అంగన్‌వాడీ కార్యకర్త(బీసీ-బీ), మద్రిమాకులపల్లె హెల్పర్ (ఓసీ), కొటాల హెల్పర్(ఎస్సీ) అభ్యర్థులకు, పెద్దమండ్యం మండలం గుడిసివారిపల్లె అంగన్‌వాడీ హెల్పర్(బీసీ-డీ) కేటాయించినట్లు పేర్కొన్నారు. పది ఉత్తీర్ణత, స్థానికులై వివాహిత వారు ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

వైభవంగా కావిళ్ల పండుగ

రామసముద్రం: మండల కేంద్రంలో సోమవారం నుంచి కావడి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరోహర నామస్మరణతో రామసముద్రం మారుమోగింది. రామసముద్రం , తిరుమలరెడ్డిపల్లె గ్రామస్తులు ఉపవాసదీక్షతో శ్రీసుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు వస్త్రాలు ధరించి కావిళ్లను శివాలయంలో పూజించారు. కేరళ వాయిద్యాలనడుమ హరోహర....హరోహర అంటు స్వామివారిని స్మరిస్తూ తమిళనాడులోని తిరుత్తనికి బయలుదేరి వెళ్లారు. అక్కడ భక్తిశ్రద్ధలతో మడుపులు చెల్లిస్తారు.

ఎన్జీవో మహాసభకు ఒప్పంద ఉద్యోగులు

మదనపల్లె సిటీ: విజయవాడలో సోమవారం జరిగిన ఎన్జీవో రాష్ట్ర మహాసభలకు జిల్లా క్షయ నివారణ ఒప్పంద ఉద్యోగులు హాజరయ్యారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ ఉద్యోగుల సమస్యలు,క్రమబద్ధీకరణ విషయాలను ఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తమను న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో 2014 నుంచి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 273 మంది ఉన్నారన్నారు. తమను క్రమబద్ధీకరణ చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లోకేష్‌బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్తాన్‌లో లైట్లు ఏర్పాటు

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామంగడిలో స్థానిక సర్పంచ్ బీబీ ఆయేషా ఆధ్వర్యంలో ఖబరస్తాన్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఖబరస్తాన్‌లో రాత్రి దహనక్రియలు చేయడానికి ఇబ్బందికరంగా ఉండటంతో గ్రామస్తులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచ్ చొరవతో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి సమస్యను వివరించి ఖబరస్తాన్‌కు విద్యుత్ వసతి కల్పించారు. అనంతరం సోమవారం పంచాయతీ సిబ్బంది వీధి లైట్లు ఏర్పాటు చేశారు.

ఇద్దరు వార్డు సభ్యులు ఏకగ్రీవం

కలకడ : మండలంలో నిర్వహించిన రెండు వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ 6వ వార్డుకు ఇరగంరెడ్డి, కలకడ టౌన్ 1వవార్డుకు యం.రిజ్వానాబేగం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. ఇద్దరూ వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు కావడం గమనార్హం. ఎంపికైన వార్డు సభ్యులను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

ములకలచెరువు: మండలంలోని పలు ఆలయాల్లో నాగుల పంచమి, శ్రావణ సోమవారం సందర్భంగా మహిళలు నాగులకు, పుట్టలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

మదనపల్లె సిటీ: నాగుల పంచమని భక్తులకు ఘనంగా నిర్వహించారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని మడికయ్యల శివాలయంలో నాగరాళ్లకు మహిళలు పసుపు, కుంకుమ పెట్టి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. నాగరాళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న పుట్టకు పాలు పోశారు. దీంతో పాటు పట్టణంలోని శివాలయాల్లో శ్రావణ సోమవారం పురస్కరించుకుని పూజలు చేశారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



ఉప్పరవాండ్లపల్లె ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అన్నారు. పల్లెబాటలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం మండలంలోని మల్లెల పంచాయతీలో పర్యటించారు. పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేస్తూ అహర్నిశలు కృషి చేస్తుంటే మీరు కనీసం ప్రజల వద్దకు వెళ్ళి తీసుకుంటున్న జీతాలకు కూడా బాధ్యతగా పని చేయలేరా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యుల నుంచి చేతివాటం ప్రదర్శిస్తే సహించేది లేదని సంఘమిత్రలను హెచ్చరించారు. వెంకట్రమణారెడ్డి అనే వ్యక్తి కాలి ఆపరేషన్‌కు సహకరించాలని ఎమ్మెల్యేకు మొర పెట్టుకోగా తక్షణం చికిత్సకు సిఫారసు చేశారు. స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, మురికి కాలువలు,సిమెంటు రోడ్లు వేయించాలని పలువురు కోరగా త్వరితగతంగా పనులు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. దేశ చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మీరంతా మళ్ళీ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ, శ్రీకంఠరెడ్డి, చెన్నకేశవరెడ్డి, రియాసత్ అలీఖాన్, వెంకట్, ఏకేఆర్, గణపతిరెడ్డి, ఆనంద రెడ్డి, క్రిష్టారెడ్డి, భాస్కర్‌నాయుడు, బసిరెడ్డి, షమీమ్, రామచంద్ర, మంజునాథ్‌రెడ్డి, వెంకటరెడ్డితో పాటు అధికారులు గిరిధర్‌రెడ్డి, విద్యాసాగర్, ప్రేమలత, శ్రీనివాసులు, హరి, ఉత్తన్న, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పెద్దమండ్యం: ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెలిగల్లు పంచాయతీలోని బీసీ కాలనీ, వెలిగల్లు, కొత్తవాండ్లపల్లె, కాయలపల్లె, పడమటి హరిజనవాడ, గురికివాండ్లపల్లె, పడమటపల్లె, కుడుములవారిపల్లె, నడింబురుజు గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. పల్లెల్లో ఎమ్మెల్యేకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యం, తాగునీరు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు. అర్హులై ఉండి పథకాలందని వారు తమ వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. వెలిగల్లు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను బదిలీ చేయవద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు విన్నవించారు. పల్లెబాటలో ఈ విషయంపై మాట్లాడుదామనుకున్నా..ఎంఈవోలు అందుబాటులో లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను బదిలీ చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, తహసీల్దారు రాము, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచులు సి.సరస్వతి, మొలక బయ్యారెడ్డి, బాషా, విశ్వనాథ కంటి విశ్వనాథరెడ్డి, మండల కన్వీనర్ చాంద్‌బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ ఛైర్మన్ రషీదా, శ్రీనివాసులు నాయక్, ఆర్‌బీకే ఛైర్మన్ చాను, జెఎస్‌వీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

తంబళ్లపల్లె: అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచించారు. సోమవారం బాలిరెడ్డిగారిపల్లె పంచాయితీలో పల్లెబాట నిర్వహించారు. దిగువపల్లెకు ఏర్పాటు చేసిన తార్ రోడ్డుతోపాటు మరో 9 సీసీ తారురోడ్లను ప్రారంభించారు. ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎంపీటీసీ సభ్యులు అప్పిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీయంగంగాధర్, ఆర్‌ఐ రవి, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచు వేణుగోపాల్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ భార్గవ్‌రెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద విద్యార్థులకు వరం

–డీఈఓ శ్రీరాం పురుషోత్తం



విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం తింటున్న డీఈఓ పురుషోత్తం

మదనపల్లె సిటీ: జగనన్న గోరుముద్ద విద్యార్థులకు వరమని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేశారు. ఆయన విద్యార్థులో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారా? ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యశాఖ సిబ్బందిని సమన్వయం చేసుకుని విద్యార్థులకు హెచ్‌బి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,వారి సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు ఫణీంద్రలు పాల్గొన్నారు.

సాల్ట్‌తో సర్వతోముఖాభివృద్ధి

కురబలకోట: సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) శిక్షణ ఉపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందని డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం పేర్కొన్నారు. ఆరు రోజుల పాటు జరిగే రెసిడెన్షియల్ సాల్ట్ శిక్షణ కార్యక్రమాలు సోమవారం నుంచి అంగళ్లలోని గోల్డన్‌వ్యాలీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాకు చెందిన యూపీ, ప్రాథమిక స్కూళ్ల హెడ్మాస్టర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సహకారంతో సాల్ట్ విజినరీ ప్రాజెక్టు ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకుని పాఠశాలలో అమలు చేయాలన్నారు. తద్వారా విద్యా ప్రమాణాలు పెరుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. శిక్షణలో పట్టు సాధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

సీఈఓ సేవలు మరువలేనివి

వాల్మీకిపురం: స్థానిక సింగల్‌విండో కార్యాలయంలో సీఈవోగా పని చేస్తున్న కుమార్ సేవలు మరువలేనివని సింగల్ విండో అధ్యక్షులు నిర్జాల శ్రీధర్‌రాయల్ అన్నారు. ఇటీవల కుమార్ విశిష్ట సేవలను గుర్తించిన ప్రభుత్వం 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రంతో సత్కరించింది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక సింగల్‌విండో కార్యాలయంలో సీఈవో కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, డైరెక్టర్ నరసింహా రెడ్డి, ఆర్‌బీకే ఛైర్మెన్ నీళ్లభాస్కర్, నాయకులు శేఖర్, అషర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె: బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన అవసరమని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ తెలిపారు. సోమవారం స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత ఆశయంతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో ఉలవలు

పీలేరు : ప్రభుత్వం 80 శాతం రాయితీతో అందిస్తున్న ఉలవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రమాదేవి తెలిపారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రాలకు చేరిన రాయితీ ఉలవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశెనగ సాగు చేయని రైతులు ఉలవలు సాగు చేసుకోవాలని కోరారు. ఉలవలు సాగు చేయడానికి సెప్టెంబర్ మాసం అనువైందని తెలిపారు. మండలంలో 341 క్వింటాళ్ల సబ్సిడీ ఉలవలు రైతు భరోసా కేంద్రాలకు చేరాయని కావాల్సిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేలలో నమోదు చేసుకోవాలని కోరారు.

స్పందన సమస్యలపై స్పందించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రదీప్

కలకడ : మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులు, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇచ్చిన సమస్యలపై సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ప్రదీప్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఓటర్ల జాబితా సవరణ, నమోదులు, మృతి చెందిన వారిపేర్లు పరిశీలించి తొలగించడం, వయస్సు నిర్ధారణ 80 సంవత్సరాలు పైబడినవారికి పరిశీలించాలని ఆదేశించారు. సచివాలయం నుంచి ధ్రువపత్రాల మంజూరులో జాప్యం వహిస్తే సహించేదిలేదన్నారు. తాత్కాలికంగా గ్రామంలో ఎవరైనా లేకపోయినా వారి పేర్లు ఓటర్ల జాబితానుంచి తొలగించరాదన్నారు. ఎన్నికల సంఘం, కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం వెంటనే పరిశీలన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్, విఆర్‌ఓ, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు అడుగులు



పాదయాత్ర చేస్తున్న జిలానీబాషాను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీదేవి, నాయకులు

కలకడ : రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్న మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు షేక్.జిలానీబాషా, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. సోమవారం జిలానీబాషా చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర కలకడ మండలంలోకి ప్రవేశించగా ఎంపీపీ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆయన వెంట కె.బాటవారిపల్లె బీసీ కాలనీలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, కుటుంబాలకు చే కూరుతున్న లబ్ధి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జూలై 15న మార్కాపురం వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పించి పాదయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. 37వ రోజు కలకడకు చేరుకున్నట్లు తెలిపారు. 1069 కిలో మీటర్ల పాదయాత్రలో ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల్లో చంద్రబాబుపై వ్యతిరేకత తగ్గలేదన్నారు. జగనన్న సంక్షేమ పాలనకే ప్రజలు జేజేలు పలుకుతున్నట్లు తెలిపారు. మార్కాపురంలో ప్రారంభమైన పాదయాత్ర ఇచ్ఛాపురం వరకూ కొనసాగుతుందన్నారు. యువత, మహిళ, రైతు, శ్రామిక వర్గాలలో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పాదయాత్రకు సంఘీబావంగా ఎంపీపీ శ్రీదేవి, కె.బాటవారిపల్లె పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై వరుణయాగం



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద సోమవారం శాస్త్రోతంగా వరుణయాగం, సహస్త ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. పురోహితులు కుమారస్వామి వరుణయాగాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కెఆర్ మల్‌రెడ్డి దంపతులు, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, కొండకిటా పాల్గొన్నారు. మొగశాలమర్రికి చెందిన మద్దెమ్మదేవత కోలాట బృందం మహిళా సభ్యులు వేసిన కోలాటం భక్తులను అలరింప చేసింది. ముద్దలదొడ్డి కళాకారుడు గంధర్వరెడ్డి ఆధ్వర్యంలో భజన చేశారు. గొరమ్మగుట్టలో వెలసిన గొరమ్మకు పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. మదనపల్లె వన్‌డిపో మేనేజర్ రమణారెడ్డి కొండకు మూడు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే కృషితో నియోజకవర్గ అభివృద్ధి



సిమెంటు రోడ్డు ప్రారంభిస్తున్న నాయకులు

బి.కొత్తకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చొరవతోనే తంబళ్లపల్లె అభివృద్ధి జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ అన్నారు. మండలంలోని గుడిపల్లె పంచాయతీ జరప్పల్లెలో సోమవారం పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. రూ.6.5 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించాక ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా?లేదా? అని విచారించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ గ్రామాలకు తారురోడ్లు వేయించిన ఘనత ఎంపీ, ఎమ్మెల్యేదేనని వివరించారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా జరప్పల్లె కాలనీ, బెంగళూరురోడ్డు-గుడిపల్లె, గుడిపల్లె మెయిన్‌రోడ్డు, మొరవపల్లె, బెంగళూరురోడ్డు-మొరవపల్లె, వడ్రోళ్లపల్లె సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. తహసీల్దారు రఫీక్ అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జడ్పీటీసీ రామచంద్ర, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలి, సర్పంచులు గిరిజ రఘునాథరెడ్డి, వెంకటరమణ, భీమిగాని నాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఉజ్జయిని సాంబశివ, లక్ష్మదేవమ్మ, జయరామిరెడ్డి, పుష్పలత, ఉమామహేశ్వరీ, మాజీ వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్ రెడ్డి, కోఆప్షన్ నాసీర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు

మదనపల్లె సిటీ: ములకలచెరువు ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఖాళీ స్థలాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382874704ను సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా బాస్కెట్ బాల్ పోటీలు



గెలుపొందిన జట్టుకు నగదు, ట్రోఫీని అందిస్తున్న సెక్రటరీ రవిచంద్ర

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో బాస్కెట్‌బాల్ కోర్టులో సోమవారం సీఎస్ఆర్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతల శ్రీధర్ రెడ్డి సహకారంతో త్రీ ఇంటూ త్రీ హాఫ్ కోర్టు బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు కడప, చిత్తూరు, మదనపల్లి, వాల్మీకిపురం, పుంగనూరు ప్రాంతాల నుంచి దాదాపు 10 బాస్కెట్ బాల్ జట్లు పోటీల్లో తలపడ్డాయి. 10 జట్లు పోటీ పడి చివరకు చిత్తూరు -ఏ , జట్టు, మదనపల్లి -ఏ జట్టు, ఫైనల్‌కు చేరుకొని తలపడ్డాయి. ఈ పోటీల్లో చిత్తూరు -ఏ జట్టు విశేష ప్రతిభచూపి విజేతగా నిలిచింది. పోరాడిన మదనపల్లి -ఏ జట్టు రన్నర్స్‌గా నిలిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొంది. విజేత జట్టుకు అసోసియేషన్ సెక్రటరీ రవిచంద్ర చేతుల మీదుగా రూ.4వేలు నగదు బహుమతితో పాటు బాస్కెట్ బాల్ ట్రోఫీని అందించారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన మదనపల్లి -ఏ జట్టుకు ప్రశంసాపత్రంతో పాటు రూ.2వేలు నగదు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ కోచ్‌లు అంజిబాబు, కిరణ్ కుమార్, పద్మనాభకుమార్, సీనియర్ క్రీడాకారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ రెడ్డి, సాయిభార్గవ్, యూసూఫ్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా ఉంగరాళ్లపల్లె

- చిరుత పులి కాదని చెప్పినా భయం వీడని ప్రజలు
- భయంతో హడలిపోతున్న గ్రామప్రజలు
- రాత్రుల్లో గస్తీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం
- ఫారెస్టు అధికారులు



గ్రామస్తులు ఇంటి నుంచి బయటకు రాక నిర్మానుస్యంగా ఉన్న ఉంగరాళ్లపల్లె

ములకలచెరువు: గ్రామస్తుల కళ్ల ముందే శనివారం రాత్రి పిల్లిని ఎత్తుకెళ్లిన అడివి జంతువును చూసిన పలువురు కచ్చితంగా చిరుతపులి అని చెబుతుండడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం సైతం భయంతో ఇంట్లో నుంచి బయటకురాకుండా ఇంట్లోనే ఉంటున్నారు. ఈ సంఘటనపై ఫారెస్టు బీటు అధికారులు సుధాకర్, గోపాల్ ఉంగరాళ్లపల్లెకు వెళ్లి విచారించి, పాదముద్రలతో అడవిపిల్లి అని నిర్ధారించారు. కానీ సోమవారం ఉంగరాళ్లపల్లె సమీపంలో చిరుత పులి వ్యవసాయ పొలంలో కనిపించిందని పుకార్లు లేవడంతో భయంతో హడలిపోతున్నారు. గత రెండేళ్ల క్రితం ములకలచెరువు మండలంలోని కనుగొండ అడవిలో చిరుతపులి కోతులను తింటుండగా మేకల కాపరులు చూసి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. పులి పాదముద్రలను నిర్ధారించిన అధికారులు కనుగొండ అడవిలోకి మేకలు, గొర్రెల కాపరులు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. అదేవిధంగా సంద్రదవి సమీపంలోని ఎలకలగుట్టలో చిరుతపులి సంచరిస్తుండగా రైతులు చూసి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. చిరుత పులితో పాటు ఒక చిరుత పిల్ల ఉందని నిర్ధారించారు అధికారులు. హార్సీలీహిల్స్ దగ్గరగా ఉండడంతో అక్కడి నుంచి ఆహారం కోసం చిరుత పులులు సంచరిస్తుంటాయని అప్పట్లో ఫారెస్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే గత కొన్ని రోజుల క్రితం తిరుమల కాలినడక వెళ్లే మార్గంలో ఒక చిన్నారిని చిరుతపుల్లి లాకెళ్లి చంపేయడం ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో గ్రామస్తులు హడలిపోతున్నారు. పులి.. గిలి అన్నట్లుగా మారించి ఉంగరాళ్లపల్లె వాసులది. పాదముద్రలు ఖచ్చితంగా అడవిపిల్లివే అని ఫారెస్టు బీటు అధికారులు సుధాకర్, గోపాల్ తెలిపారు. చిరుత పులి వచ్చివుంటే ఆవులనో, కుక్కలనో చంపి లాకెళ్తుంది గానీ, పెంపుడు పిల్లులు, కోళ్లను తీసుకొనిపోదని చెప్పారు. అడవిపిల్లిని బాబిరిపిల్లి అని మన వాడుక భాషలో అంటారన్నారు. ఈ గ్రామాల చుట్టుపక్కల రాత్రుల్లో గస్తీ నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే పీలేరు పట్టణంలోని ఎస్‌కేడీ నగర్, ఆర్టీసీ నల్లగుట్ట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వీధిలైట్లు, పైపులైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని ప్రతి వీధిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడాలేని విధంగా సరికొత్త ఆలోచనలతో నూతన పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వంలో పార్టీలు, వర్గాలు, కులమత బేధాలు లేకుండా అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ క్యాలండెర్ ప్రకారం ప్రకటించిన తేదీకి సీఎం బటన నొక్కగానే డబ్బులు లబ్ధిదారుల ఖాతాలకు జమ అవుతున్నట్లు తెలిపారు. గడచిన నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో దాదాపు వంద శాతం అమలు చేయడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ సంక్షేమ పథకాలు అమలు అవుతున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను తక్షణం పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు చలవతి, హరిత, నాయకులు హుమయూన్, మహితాఆనంద్, నాగరాజమ్మ, బారేషా, షాకీర్, జయపాల్‌రెడ్డి, షాజహాన్, శ్రీనాథరెడ్డి, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఉదయ్‌కుమార్, కాలనీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

కేవీపల్లె : మండలంలోని మోటుపల్లెవాండ్లపల్లెలో సీతారాముల ఆలయంలో స్వామివారి కల్యాణంగా ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూడు రోజుల నుంచి నూతన సీతారాముల విగ్రహ ప్రతిష్ట చేశారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం సోమవారం ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు. పలువురు భక్తులు కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దళితులకు అసైన్డ్ భూములు కేటాయించండి

ములకలచెరువు: మండలంలో ఆక్రమణకు గురైన అసైన్డ్ భూములను పేద దళితులకు కేటాయించాలని సీపీఐ నాయకులు అంజనప్ప, బీఎస్పీ నాయకుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు భూములు కేటాయించాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. నిరసనలో రమణ, నరసింహులు, మధు, వెంకటరమణనాయుడు తదితరులు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాలు రహదారిలో వేయొద్దు

గుర్రంకొండ: చికెన్ దుకాణాల్లోని కోళ్ల వ్యర్థాలను రోడ్లకు ఇరు వైపులా వేయవద్దని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సూచించారు. గుర్రంకొండ పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాల యజమానులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలను కలకడ రోడ్డు, సంగసముద్రం రహదారికి ఇరు వైపులా వేస్తుండడంతో దుర్వాసన వస్తోందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. చికెన్ వ్యర్థాలను సిమెంట్, ప్లాస్టిక్ సంచుల్లో వేసి పంచాయతీ చెత్త బండిలో వేయాలన్నారు. పంచాయతీ ఈఓ విశ్వనాథ్ మాట్లాడుతూ కలకడ క్రాస్‌లో ఒక ట్రాక్టర్ ట్రాలీని, సంగసముద్రం రోడ్‌లో చెత్త వేసుకొనే పెద్ద తొట్టెను, పంచాయతీ కాంప్లెక్స్ వద్ద మరో చెత్తతొట్టెను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో చికెన్ ,మటన్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు

మదనపల్లె : మున్సిపాలిటీ 2వవార్డు పరిధి వైఎస్సార్ కాలనీలో అనుమతి లేకుండా గుట్టను చదునుచేసి ఆక్రమించేందుకు ప్రయత్నించిన ప్రభుత్వ స్థలంలో తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వీఆర్వో వరలక్ష్మి తెలిపారు.